క్లుప్తంగా

సీఎంను కలిసిన బోధన్ ఎమ్మెల్యే దంపతులు



బోధన్: బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సతీమణి అయేషా ఫాతిమాతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా..



బోధన్‌టౌన్/ఎడపల్లి/రెంజల్: బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరిపారు. బోధన్, ఎడపల్లి, రెంజల్ మండలాల పరిధిలో నాయకులు కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే షకీల్ పనిచేస్తున్నారని కార్యకర్తలు కొనియాడారు.

మజిద్ ప్రహరీ పనులు ప్రారంభం



రుద్రూర్: బొప్పాపూర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మజిద్ ప్రహరీ పనులను మంగళవారం జెడ్పీటీసీ నరోజి గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మజిద్ కమిటీ చైర్మన్ ఖలీల్ ఖాన్, విండో మాజీ వైస్ చైర్మన్ బాపూజీ లింగం, సోషల్ మీడియా బీఆర్ఎస్ కన్వీనర్ లాల్ మొహమ్మద్, సురేందర్, మారుతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు..



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులను సర్పంచ్ పానుగంటి రూపసతీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రెండు పాఠశాలలకు మన ఊరు– మన బడి కార్యక్రమం కోసం రూ.20లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యార్థుల సౌకర్యం కోసం మూత్రశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ ఎంబడి సంతోషం, ఉపసర్పంచ్ సుద్ద గంగారాం, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వీడీసీ సభ్యులు నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



ఖలీల్‌వాడి: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూమయ్య తెలిపారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో హోలీ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వి ఠల్ గౌడ్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. భూమయ్య మాట్లాడుతూ.. ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని 58, 59 జీవోలు విడుదల చేసినప్పటికీ ఎక్కడా పట్టాలు ఇవ్వలేదన్నారు. ప్రజా ధనంతో నిర్మాణం చేసినటువంటి డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులకు ఇవ్వడం లేదన్నారు. దళితబంధు పేరుతో అనర్హులకు దళితబంధు పథకాన్ని ఇచ్చి అర్హులకు నష్టం చేస్తున్నారన్నారు. కలెక్టర్ ద్వారా నేరుగా అర్హులకే దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా హోలీ వేడుకలు

హోలీ సంబురాలు మంగళవారం అంబరాన్నంటాయి. బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ వారి మిత్రుల ఇళ్లకు వెళ్లి రంగులు చల్లుతూ హంగామా చేశారు. కొన్ని గ్రామాల్లో డప్పులతో ఊరేగింపు కూడా నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బోధన్ పట్టణంలో హోలీ సందర్భంగా నృత్యం చేస్తున్న యువకులు



వేడుకల్లో మామిడిపల్లి ఆదర్శ నగర్ కాలనీవాసులు



ఆర్మూర్ పట్టణంలో.. యువకులు



రుద్రూర్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



వర్ని మండలంలో...



మోస్రా మండల కేంద్రంలో..



కమ్మర్‌పల్లిలో .. బీఆర్ఎస్ నేతలు



తాడ్‌బిలోలిలో .. గ్రామస్తులు



బాల్కొండలో.. యువకులు



రెంజర్లలో .. చిన్నారులు



సోన్‌పేట్‌లో.. యువకులు



మోర్తాడ్‌లో హోలీ ఆడుతున్న మహిళలు



వేల్పూర్‌లో .. యువకులు



మోర్తాడ్‌లో.. చిన్నారులు



ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్‌రెడ్డి ఇంటి వద్ద..



కౌన్సిలర్లతో మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత

ఏ కష్టమొచ్చినా ఆదుకుంటాను

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నానని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నా జీవితం ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకే అంకితం చేస్తానన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు జన్మదిన శుభాకంక్షలు తెలపడానికి వచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే పరీక్ష ప్యాడ్లు అందజేశారు. నిజామాబాద్ జిల్లాతో పాటు ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు పూజ నరేందర్, ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ పస్క నర్సయ్య, సొసైటీ చైర్మన్లు కళ్లెం భోజా రెడ్డి, సోమ హేమంత్ రెడ్డి, సర్పంచ్‌లు ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, పుట్టింటి లింబా రెడ్డి, సట్లపల్లి సవిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన కుస్తీ పోటీలు



బొప్పాపూర్‌లో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రూర్: రుద్రూర్ మండలం బొప్పాపూర్‌లో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఉత్కంఠ భరితంగా పోటీలు కొనసాగాయి. తొలి కుస్తీ రూ.20తో ప్రారంభించి.. ఆఖరు కుస్తీకి రూ.2,001 అందజేశారు. ప్రతి ఏటా హోలీ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, వీడీసీ చైర్మెన్ పట్ల సురేష్, త దితరులున్నారు.

అంబం(ఆర్)లో..

రుద్రూర్ : అంబం(ఆర్)లో కుస్తీ పోటీలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలకు వివిధ గ్రామాల నుంచి మల్లయోధులు తరలి వచ్చారు. కోర్వ భూషణ్, మహేష్, శానం సాయిలు తదితరులు పాల్గొన్నారు.



అంబంలో తలపడుతున్న మల్లయోధులు

గ్యాస్ సిలిండర్లతో మహిళల నిరసన

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని మంగళవారం మోస్రా మండలం గోవూర్‌లో మహిళలు డిమాండ్ చేశారు. రోడ్లపై గ్యాస్ సిలిండర్లు పెట్టి చెంచాలతో శబ్దం చేస్తూ పెంచిన వంట గ్యాస్ ధరకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రూ.400 ఉన్న వంటగ్యాస్ ధరను రూ.1200కు ప్రభుత్వం పెంచిందని, ధరలు తగ్గించే వరకు ప్రతిరోజు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, వార్డు సభ్యురాలు మహిముదా, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



గోవూర్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

ఎడపల్లి(బోధన్): నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన పేదలు జాన్కంపేట్ శివారులో వేసిన గుడిసెల వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుడిసెలు వేసుకున్న వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.3 నుంచి రూ.5 లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత ఎండీ అబ్బాస్

కుర్నాపల్లిలో బండరాళ్ల పోటీలు

ఎడపల్లి(బోధన్): కుర్నాపల్లిలో మంగళవారం బండరాళ్ల ఎత్తే పోటీలు నిర్వహించారు. ప్రతి ఏటా హోలీ పండుగ సందర్భంగా ఈ పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యక్తులు 80, 100 కిలోల బండరాళ్లు లేపి బలప్రదర్శన చేశారు. గ్రామస్తులు రవీందర్ గౌడ్, సాయిలు, సుమన్, యువకులు పాల్గొన్నారు



బండరాళ్లు ఎత్తుతున్న కుర్నాపల్లి గ్రామస్తులు

మున్నూరు కాపు భాజన్న గైని కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో మున్నూరు కాపు భాజన్న గైని పంత నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంత అధ్యక్షుడిగా బండ్లపల్లి గంగూలీ, పెద్దమనుషులుగా ద్యాగ నిఖిల్, బండ్లపల్లి రాజు, సడాక్ భాజన్నలు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సంఘం సభ్యులు అభినందించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు హోలీ పండుగ వేళ కొనసాగాయి. మంగళవారం నాటికి దీక్షలు 79వ రోజుకు చేరాయి. దీక్షలో హైకోర్టు న్యాయవాది వీరభద్రరావు, న్యాయవాదులు గంగారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్ నాయక్, సాయిలు, అజయ్, అర్జున్ రాందర్‌లు కూర్చున్నారు.

అనాథ చిన్నారులకు సర్పంచ్ చేయూత

రెంజల్(బోధన్): అప్పుల బాధతో తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోగా అనాథలైన చిన్నారులకు మండలంలోని సాటాపూర్ గ్రామ సర్పంచ్ ఎఖార్‌పాష చేయూతనందించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ముగ్గురు చిన్నారుల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వాటి పత్రాలను మంగళవారం బాధితులకు అందించారు. నవీపేట్ మండలం పోతంగల్ గ్రామానికి చెందిన గోసంగి నవీన్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా.. ఆయన భార్య లత మూడేళ్ల క్రితమే చనిపోయింది. దీంతో వారి పిల్లలు సహస్ర, నాగలక్ష్మి, విష్ణుప్రియలు అనాథలుగా మారారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హైమద్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న సర్పంచ్ ఎఖార్‌పాష

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సాలంపాడ్ క్యాంప్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ తూము అంజమ్మ

బోధన్ రూరల్ (బోధన్): సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంపులో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరవ్వగా మంగళవారం ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ తూము అంజమ్మలు భూమి పూజ చేసి రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, ఎంపీటీసీ వెంకట్రావు, సొసైటీ చైర్మన్ గుణపాటి బ్రహ్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు తూము రవీందర్ రెడ్డి, రాజేశ్వర్, ఉప సర్పంచ్ ఆవుల శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలజ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెరుగుతున్న మహిళా సభ్యులు

- స్వయం సహాయక సంఘాల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్న యువతులు
- మహిళల సాధికారతకు దోహదం చేస్తున్న రుణాలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మోర్తాడ్‌లో సమాఖ్య సమావేశానికి హాజరైన మహిళలు

మోర్తాడ్(బాల్కొండ): మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ లక్ష్యం హెచ్చింపవుతోంది. మహిళలు తమ స్వశక్తిపై నిలవడానికి స్త్రీనిధి ద్వారా అందిస్తున్న రుణాల పరిమితి కూడా ఏటా పెరుగుతోంది. మహిళలు సాధికారత సాధించడానికి బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాల పంపిణీ ఎంతో దోహదపడుతుందని సెర్ప్ అధికారులు చెబుతున్నారు. యుక్త వయస్సు వచ్చిన యువతులు స్వయం సహాయక సంఘాల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో ప్రతి ఏటా స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్య పెరుగుతుంది. వివిధ కారణాలతో మరణించినవారు, వృద్ధాప్యంతో బాధపడుతున్నవారిని సంఘాల నుంచి తొలిగిస్తున్నా కొత్తగా చేరేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు గతంలో కంటే ఎక్కువగానే ఉంటున్నారు. వీరికి మన జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.870 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ.150 కోట్ల వరకు రుణాలను పంపిణీ చేశారు. అంటే మహిళా సంఘాల సభ్యులకే రుణాల పంపిణీ రూ.వెయ్యి కోట్లు దాటిపోవడం చూస్తే మహిళలకు పెరిగిన ప్రాధాన్యత ఏమిటో అర్థం అవుతోంది.

మహిళా సమాఖ్య స్వరూపం..

జిల్లా సమాఖ్య	1
మండల సమాఖ్యలు	27
గ్రామ సమాఖ్యలు	806
స్వయం సహాయక సంఘాలు	24,017
సంఘాల్లోని మహిళా సభ్యులు	2,42,124

ఘనంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి జన్మదినం



వెల్మల్‌లో జన్మదిన వేడుకలు జరుపుతున్న బీఆర్ఎస్ నేతలు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్, డొంకేశ్వర్ మండలాలలోని పలు గ్రామాలలో ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకులను కట్ చేసి మిఠాయిలు పంచిపెడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనునిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.